క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాత బంధువులు

లక్కవరపుకోట: అమెరికాలో ఉంటున్న మండలంలో మల్లివీడి గ్రామానికి చెందిన బైలపూడి మధు దంపతులు కొత్తపాలెంలో నిర్మించిన రామాలయానికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. నగదును దాత బంధువులు పాలవెల్లి, బోను సన్యాసిరావు ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. ఆలయ ప్రతిష్ఠను బుధవారం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: మండలంలోని వేండ్రాం గ్రామం కొత్త చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎస్.హరిహరరావు బుధవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్ల సీట్లను తనిఖీ చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 6 గంటలకే పనులకు హాజరై, 10.30 గంటల్లోగా ముగించాలని వేతనదారులకు సూచించారు. పని ప్రదేశంలో వేతనదారుల కోసం తాగు నీరు, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని, ప్రథమ చికిత్స కిట్లతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ బి.కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



అధికారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ చంద్రకుమారి

దత్తిరాజేరు: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో, ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ చంద్రకుమారి ఉపాధి హామీ, వెలుగు, తదితర శాఖల అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో బుధవారం ఆమె సమావేశమయ్యారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి పనులను ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు చేయించాలని ఏపీఓ అప్పలనాయుడుకు సూచించారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

వారం రోజుల్లో ఉపాధి పనులు ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీడీఓ పావని

మెరకముడిదాం: ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొత్త పనులను వారం రోజుల్లోగా ప్రారంభించాలని ఎంపీడీఓ ఎం.పావని, ఉపాధి హామీ ఏపీడీ మీసాల శ్రీనివాసరావు ఉపాధి సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల పనిదినాలను మెరకముడిదాం, కొండలావేరు, చెల్లాపురం క్షేత్రసహాయకులు పూర్తిచేశారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పనులు చేపడుతున్న ప్రదేశంలో కచ్చితంగా టెంట్లు వేయాలని, ప్రథమచికిత్స కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇన్చార్జి ఏపీఓ నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో చలివేంద్రం



ప్రయాణికులకు మజ్జిగ అందజేస్తున్న డీఎం రమేష్, తదితరులు

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీకాంప్లెక్స్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం చిత్రకళ స్టూడియో యజమాని రాజు ఆర్థిక సహాయంతో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ ప్రారంభించారు. ప్రయాణికులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిన సందర్భంగా ప్రయాణికులు ఎక్కువ మోతాదులో నీళ్లు తాగాలని, వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

చంద్రబాబు రాజకీయ కుట్రతో వృద్ధులకు కష్టాలు

- ఎన్నికల ప్రచారంలో మంత్రి బొత్స సత్యనారాయణ



నీలాద్రిపురంలో ప్రచారం చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లిరూరల్(గరివిడి): పేద వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు వలంటీర్ల ద్వారా ఇంటి వద్ద పింఛన్ పంపిణీ చేయకుండా చంద్రబాబు నాయుడు కుయుక్తులు పన్ని ఆపగలిగారని, నేడు వృద్ధులు పడుతున్న కష్టాలకు ఆయనే కారణమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. గరివిడి మండలంలోని నీలాద్రిపురం(సూరంపేట),రేగటి గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు వారికి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి బొత్స మాట్లాడుతూ వృద్ధులకు పింఛన్లు అందకుండా, పేదవాడి ఆకలి మీద చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతర పింఛన్ లబ్ధిదారులకు రెండు నెలలు మాత్రమే ఇబ్బందులు ఉంటాయని, మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, ఎప్పటిలాగే వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే పింఛన్ డబ్బులు అందిస్తామని భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో రేగటి సచివాలయం పరిధి ప్రజలకు వివిధ పథకాల రూపంలో రూ.15.50 కోట్లు అందజేసిందని చెప్పారు. ఎక్కడా ఒక్కరూపాయి అవినీతి జరగలేదని, పథకాల మంజూరులో పక్షపాతం చూపలేదన్నారు. పేదల సంక్షేమం, వారి ఆర్థికాభివృద్ధే సీఎం జగన్ అజెండా అని చెప్పారు. ఇన్నాళ్లూ ఎక్కడున్నారో తెలియని టీడీపీ నాయకులంతా ఎన్నికల సమయం కావడంతో పగటివేషగాళ్ల మాదిరిగా గ్రామాల్లోకి వచ్చి బూటకపు హామీలు ఇస్తారని, వారిని నమ్మవద్దన్నారు. టీడీపీ హయాంలో ఏం పథకాలు అమలు చేశారు, ఎవరికి మేలు చేశారు, ఏం అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని ఆ పార్టీ నాయకులను నిలదీయాలని ప్రజలకు సూచించారు. సీఎం జగన్ పాలనలో ప్రతి కుటుంబానికీ మేలు జరిగిందని, గత టీడీపీ పాలనకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనను బేరీజు వేసుకోవాలని చెప్పారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, విజయనగరం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు.

ఇది పేదల పక్షాన నిలిచిన ప్రభుత్వం

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల పక్షాన నిలిచిందని, పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అరకొరగా అమలు చేసిన పథకాలను సైతం ప్రజలకు మంజూరు చేసేందుకు జన్మభూమి కమిటీలు లంచాలు వసూలు చేసేవని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పారదర్శకంగా, అవినీతి, లంచాలకు తావులేకుండా పథకాలు అందుతున్నాయని చెప్పారు. ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్‌బాబు, స్థానిక ఎంపీటీసీ కడుమల రాంబాబు, మాజీ సర్పంచ్ అలమండ అప్పలనాయుడు, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, లెంక శ్రీరాములు, పలు పంచాయతీల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.



రేగటి గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స

సీఎం జగన్‌తోనే సమగ్రాభివృద్ధి



పురిటిపెంటలో ప్రచారం చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అప్పలనరసయ్య తదితరులు

- ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని, పేద ప్రజలు మరింత ఆర్థికాభివృద్ధి సాధిస్తారని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండల కేంద్రంలోని పురిటిపెంట న్యూకాలనీ, మెంటాడ జంక్షన్, నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి సంక్షేమ సారథి సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి కొనసాగితేనే రాష్ట్రం సస్యశ్యామలంగా, ప్రజలు సంతోషంగా ఉంటారని అన్నారు. ఎమ్మెల్యే అప్పలనరసయ్య తనయుడు సాయిగురునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ, తుమికాపల్లి, కొత్తశ్రీరంగరాజపురం గ్రామాల సర్పంచ్‌లు బెల్లాన త్రినాథరావు, యిజ్జిరోతు పైడిపునాయుడు, నాయకులు మండల సురేష్, రేగ సురేష్, మంత్రి నర్సింగరావు, సత్యం అప్పలనాయుడు, గేదెల జగదీశ్వరరావు, జి.సన్యాసిరావు, ఇనుమల రాజు, కర్రినానాజీ, కర్రి రామునాయుడు, చీపురుపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



పురిటిపెంటలో ప్రచారం చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అప్పలనరసయ్య తదితరులు

గెలుపే లక్ష్యం



కొర్లాంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న జెడ్పీటీసీ నరసింహమూర్తి, జైహింద్‌కుమార్

గంట్యాడ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ కోరారు. మండలంలోని పెదమజ్జిపాలెం, తామరపల్లి, కొర్లాం, గింజేరు గ్రామాల్లో పార్టీ కార్యకర్తలతో బుధవారం వారు సమావేశమయ్యారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని చెప్పారు. అలాగే టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు చేసిన అవినీతి, అరాచకాలను, హామీలు అమలు చేయకుండా అన్నివర్గాల ప్రజలను చంద్రబాబునాయుడు ఎలా మోసం చేశారన్నది ప్రజలకు గుర్తు చేయాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, జేసీఎస్ కన్వీనర్ రామసూర్యం, నాయకులు కరక శ్రీను, చప్ప చిన్న, దాలితాత, కోడెల ముత్యాలనాయుడు, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో తెట్టంగి

- రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు
- వివిధ పథకాల రూపంలో ప్రజలకు చేకూరిన లబ్ధి: రూ.19.65 కోట్లు
- నాన్ డీబీటీ విధానంలో ఖర్చు చేసిన మొత్తం: రూ.4.84 కోట్లు



తెట్టంగి సచివాలయం

గుర్ల: మండలంలోని తెట్టంగి గ్రామం ప్రగతి పథంలో దూసుకుపోతుంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. తెట్టంగి, పోలాయవలస గ్రామాలను కలిపి తెట్టంగి కేంద్రంగా సచివాలయం ఏర్పాటు చేశారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో గత టీడీపీ ప్రభుత్వం కంటే మెరుగ్గా తెట్టంగి సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు జరిగాయని ప్రజలు చెబుతున్నారు. సుమారు రూ.4 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.26 లక్షలతో సిమెంట్ రోడ్లు, కాలువలు, రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం నిర్మించారు. సొంత స్థలాలు ఉన్న 94 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసి, నిర్మాణాల కోసం రూ.1.67 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించింది. తెట్టంగి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ.1.32 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి, మౌలికసదుపాయాలు మెరుగుపరిచారు.జలజీవన్ మిషన్ పథకంలో భాగం గా తెట్టంగిలో రూ. 84 లక్షలతో, పోలాయవలసలో రూ.54 లక్షలతో ఇంటింట తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. తెట్టంగి శ్మశాన వాటికలో రూ. 3 లక్షలతో బోరు, స్నానాలకు కుళాయిలు ఏర్పాటు చేశారు. పథకాలకు సంబంధించి ప్రత్యక్ష నగదు బదిలీ విధానం(డీబీటీ)లో ఈ సచివాలయం పరిధి ప్రజల ఖాతాల్లో ప్రభుత్వం ఐదేళ్లలో రూ.19,65,40,844 జమచేసిందని, వివిధ పథకాలకు సంబంధించి పరోక్ష విధానంలో (నాన్ డీబీటీ) రూ.4,84,14,992 ప్రభుత్వం ఖర్చు చేసింది.




తెట్టంగిలోని ఓ వీధిలో ఏర్పాటు చేసిన ఇంటింట కుళాయిలు



మీసాలపేట వీధిలో వేసిన సీసీ రోడ్డు



శ్మశాన వాటికకు నిర్మించిన సిమెంట్ రోడ్డు



రాజుల వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు, కాలువలు



హైస్కూల్‌లో నాడు-నేడు ద్వారా సమకూర్చిన బెంచీలపై కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు



శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన బోరు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



బొండపల్లి: జియ్యన్నవలసలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొండపల్లి: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని గొట్లాం పంచాయతీ పరిధి జియ్యన్నవలస గ్రామస్తులకు ఎన్నికల నిబంధనలపై బుధవారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పక్కాగా పాటించాలని సూచించారు. అనవసరంగా గొడవలకు దిగి కేసుల్లో ఇరుక్కోవద్దని, నిబంధనలకు లోబడి నడుచుకోవాలన్నారు. రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయవద్దని సూచించారు.రాజకీయ పార్టీలు ఎలాంటి ర్యాలీలు నిర్వహించాలనుకున్నా అనుమతి తప్పనిసరని అన్నారు. అక్రమంగా మద్యం నిల్వ చేసినా తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని, తగాదాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఎస్ఐ కె.లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



గంట్యాడ: దిగువకొండపర్తిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

గంట్యాడ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలంతా సహకరించాలని విజయనగరం రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు కోరారు. దిగువకొండపర్తి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గొడవలకు పాల్పడి చిక్కుల్లో పడవద్దని అన్నారు. ఎస్ఐ సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి



కొత్తవలస: తుమ్మికాపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తవలస: వేసవి ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందని, వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో ఉపాధి వేతనదారులు, రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ బారిన పడితే కళ్లు తిరగడం, తిమ్మిర్లు, దద్దుర్లు, నీరసం, మైకం, తలనొప్పి, వికారం, చెమటలు, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల మధ్య అత్యవసర పనులు ఉంటే తప్ప ఎండలో తిరగరాదన్నారు. బయటకు వచ్చేవారు టోపీ, చెప్పులు, కళ్లద్దాలు ధరించాలని సూచించారు. కొబ్బరి నీళ్లు, బార్లీ, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి ద్రవపదార్థాలను తీసుకోవాలన్నారు. హెచ్‌వీ పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీ కామేశ్వరి, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించండి



గజపతినగరం రూరల్: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ ప్రసాద్

గజపతినగరం రూరల్: వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ జయంత్‌ప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతీ సచివాలయం వద్ద తాగునీరు అందుబాటులో ఉంచాలని, ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని చెప్పారు. ఈఓపీఆర్డీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బంగారమ్మ తల్లి తీర్థం

జామి: మండలంలోని తాండ్రంగి గ్రామంలో బంగారమ్మ తల్లి తీర్థం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. తీర్థం సందర్భంగా ఎడ్ల బళ్ల పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లకు సన్మానం

విజయనగరం: ఉత్తరాంధ్రకు చెందిన ముగ్గురు ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లకు ఒకే వేదికపై సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం రాత్రి స్థానిక శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవాలయం ప్రాంగణంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ముందుగా వాసవీమాత ప్రార్థనతో ప్రారంభమైన సభకు శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు దానగుణం కలిగి ఉంటారని, తను సంపాదించిన దానిలో కొంతభాగాన్ని సేవకు వినియోగిస్తారని అన్నారు. ఇటీవల ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లుగా విజయనగరం నుండి నియమితులైన కుమ్మరిగుంట శ్రీనివాసరావు, శ్రీకాకుళం నుండి తమ్మాన భాస్కర్, విశాఖపట్నం నుండి గునిశెట్టి శ్రీనివాస్‌లను అభినందనలు తెలియజేస్తూ ఘనంగా సత్కరించారు. స్థానిక శాసనసభ్యులు కోలగట్ల వీరభద్రస్వామి ఆశీస్సులతో డైరెక్టర్ అవకాశం లభించినట్లు చెప్పారు. విశాఖపట్నం డైరెక్టర్ జి. శ్రీనివాస్, శ్రీకాకుళం డైరెక్టర్ తమ్మాన భాస్కర్ ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మిత్రులు గ్రూప్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్, కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి సముద్రాల నాగరాజు, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం కన్వీనరు పెంటపాటి కామరాజు, ప్రముఖ న్యాయవాది బొడ్డు సత్యనారాయణ, ఉడుత కాశీ, వాసవీ క్లబ్ గవర్నర్ ఆత్మకూరి సాంబమూర్తి, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, వాసవీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు పేర్కొన్నారు. నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్న శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సిబ్బందికి వివిధ రకాల అగ్నిప్రమాదాలపై అవగాహన కలిస్తూ, వాటి నివారణ చర్యలను గురించి ప్రాక్టికల్‌గా డెమో చేసి చూపించారు.

హెచ్చరిక ప్రకటన

నా క్లయింట్ శ్రీ P. వెంకట రావు తండ్రి శ్రీ (లేటు) సంజీవ రావు, నివాసం : విశాఖపట్నం టౌన్ వారు దిగువ షెడ్యూల్ ఆస్తి యొక్క సంపూర్ణ యజమాని. అతను సదరు ఆస్తిని జూన్ 2018 సంవత్సరంలో శ్రీ అవగడ్డ పిన్నం నాయుడు మరియు ఇతరులు, ప్రాతినిధ్యం వహిస్తున్న వారి G.P.A. హోల్డర్లు శ్రీమతి P. సన్యాసమ్మ మరియు ఇతరుల నుండి కొనుగోలు చేసారు. అప్పటి నుండి నా క్లయింట్ నిరంతర శాంతియుత స్వాధీనత కలిగి ఉన్నారు మరియు ఆస్తిని అనుభవిస్తున్నారు. ఇటీవల కొంతమంది వ్యక్తులు అతని ఆస్తిలో అక్రమంగా ప్రవేశించుటకు ప్రయత్నం చేస్తున్నారు.

ఎవరైనా అటువంటి అక్రమాలకు ప్రయత్నిస్తే వారి అన్ని చర్యల కొరకు చట్టంలోని సివిల్ మరియు క్రిమినల్ నిబంధనల ప్రకారం మా క్లయింట్ తీసుకునే చర్యలకు వారే బాధ్యులవుతారని ఇందుమూలంగా సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది. నా క్లయింట్ సూచనల మేరకు ఈ ప్రకటన జారీచేయడమైనది.

షెడ్యూల్

విజయనగరం జిల్లా, S. కోట సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, వేపాడ మండలం, కొండగంగుపూడి గ్రామం మరియు పంచాయతీలో S. నం. 26/4A లోని ఎ.2–11 సెంట్లు, S. నం.26/4లోని ఎ.0–24 సెంట్లు మరియు S. నం. 27/5లోని ఎ.0–45 సెంట్లు విస్తీర్ణం గల జిరోయితి వ్యవసాయ మెట్ట భూమి యావత్తు. సరిహద్దులు : తూర్పు : చెరువు, దక్షిణం : చెరువు, పడమర : బంజరుభూమి, ఉత్తరం : రస్తా.

సం/- రాచకొండ ఉమాకుమార్ శాస్త్రి, అడ్వకేట్
సాయిశ్రీ విహార్, FF-1, 15-14-13,
కృష్ణనగర్, M.R. పేట, విశాఖపట్నం-2
సెల్ : 98482 94049